క్లుప్తంగా

9 నుంచి 'జగనే ఎందుకు కావాలి?'

నాగలాపురం: ఈ నెల 9వ తేదీ నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ 9వ తేదీ నుంచి ఈనెల 23వ తేదీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆయా సచివాలయ పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు అందరు పాల్గొనాలన్నారు. నాలుగేళ్ల జగనన్న పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని గడప గడపకు వివరించాలని కోరారు.

ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్లు


బాపనయ్య


సతీష్‌కుమార్‌

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు అధ్యాపకులు డాక్టరేట్‌ అందుకున్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త సి.బాపనయ్యకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లిథియం అయాన్‌ బ్యాటరీలపై ఉపయోగించే పదార్థాలపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ లభించింది. అదే విధంగా కంప్యూటర్‌ సైన్స్‌ విభాగాధిపతి బి.సతీష్‌కుమార్‌ కంప్యూటర్‌ నెట్‌వర్క్‌ నాణ్యత పెంపుదల అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ ప్రకటించింది. మంగళవారం వీరిని కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం.శ్రీలత, వైస్‌ ప్రిన్సిపల్‌, డాక్టర్‌ ఎస్‌.మురళి, అధ్యాపకులు అభినందించారు.

నవరస భరితం శ్రీనివాస సంగీత గేయధార


భూమన్‌, పి.సుశీలను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్‌: చెన్నైకి చెందిన సి.శోభారాజ్‌ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన శ్రీనివాస సంగీత గేయధార నవరస భరితంగా సాగుతూ సభికులను మైమరపించింది. ఎస్వీబీసీ చైర్మన్‌ డాక్టర్‌ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర సారథ్యంలో చేపట్టిన ఈ శ్రీనివాస సంగీత గేయధారకు అవధాని ఆముదాల మురళి, డాక్టర్‌ పీసీ వెంకటేశ్వర్లు, కొప్పరపు అనంత శేషశైలేంద్ర, సి.శోభారాజా, సాహితీ వేత్త భూమన్‌ పృచ్ఛకులుగా వ్యవహరించగా, ముఖ్య అతిథిగా హాజరైన గానకోకిల పి.సుశీల సంగీత అంశం పృచ్ఛకురాలిగా వ్యవహరించారు. తెలుగు భాషకే సొంతమైన ప్రక్రియగా సంగీత గేయధార ఆద్యంతం అద్వితీయంగా సాగుతూ ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ శ్రీనివాస సంగీత గేయధారకు చెన్నైకి చెందిన సంగీత విద్వాంసుడు నూకల హనుమంతరావు బృందం అద్భుతంగా వాయిద్య సహకారం అందించింది. అనంతరం గానకోకిల పి.సుశీల చేతుల మీదుగా సాయికృష్ణ యాచేంద్రకు స్వర్ణ కిరీటధారణతో ఘనంగా సత్కరించి అభినందించారు.

బస్సులు కండీషన్‌లో ఉంచాలి

తిరుపతి అర్బన్‌: వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను కండీషన్‌లో ఉంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాలోని 11 డిపోలకు చెందిన మెకానిక్‌లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అడిగిన మేరకు విడిభాగాలను అందిస్తున్నారని.. స్టోర్స్‌లో మిగిలి ఉన్నాయని వెల్లడించారు. అయితే కొందరు మెకానిక్‌లు వాటిని అమర్చడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కండీషన్‌లో ఉండే సర్వీసులను మాత్రమే రూట్‌పై పంపాలని స్పష్టం చేశారు. తెల్లవారుజామున మంచు కురుస్తున్న నేపథ్యంలో ఫాగ్‌లైట్లు(అధిక ఫోకస్‌ ఉండేవి)ను అన్ని సర్వీసులకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా వహిస్తే ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు. మెకానిక్‌ ఇంజినీర్‌ నరసింహులుతోపాటు వివిధ డిపోల అధికారులు హాజరయ్యారు.

10న తిరుపతిలో మహా భోగ్‌ ఉత్సవం

తిరుపతి కల్చరల్‌: స్వామి హథీరాం బావాజీ జీవసమాధి అయిన రోజును బర్షి ఉత్సవంగా నిర్వహించడం ఆనవాయితీ అని, ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంలో వేడుకగా మహా భోగ్‌ ఉత్సవం చేపడుతున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్‌ బి.శివ నాయక్‌ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బంజారాలు, బంజారా భక్తులు, సాధు సంత్‌లు, బావాజీలు, గురువులు తిరుమల తిరుపతిని సందర్శించి హథీరాం బావాజీ జీవసమాధి అయిన రోజు బర్షి ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. బంజారా భక్తులు, స్వామీజీలతో నగరంలో శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం


పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 17వ వార్డు పరిధిలోని పెద్దమసీదు వీధి, జానుల్లా వీధి, జయరామరావువీధి, సినిమావీధిలో ఆయన పర్యటించారు. ఆయనకు స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఆపూర్వ ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ఆయన మమేకమయ్యారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధిని అంకెలతో సహా వివరించారు. పథకాలను కుల, మత, రాజకీయాలకతీతంగా పారదర్శకంగా అందించినట్లు తెలిపారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. గత 30 ఏళ్ల కాలంలో జరగని శ్రీకాళహస్తి నియోజకాభివృద్ధి సీఎం జగనన్న సహకారంతో నాలుగున్నర ఏళ్లలో చేసినట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్లినా తాము పథకాల లబ్ధితో సంతోషంగా ఉన్నామని, సంక్షేమ ప్రదాతకు తోడు ఉంటామని ప్రజలు చెబుతుండడం జగనన్న పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. స్థానికులు విన్నవించిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ పట్టణ నాయకులు పగడాల రాజు, జనార్దన్‌రావు పవార్‌, గుమ్మడి బాలకృష్ణయ్య, ముత్యాల పార్థసారథి, మహ బూ బ్‌బాషా, గోరా, నంద, తమిమ్‌, సర్దార్‌, ఇస్మాయిల్‌, షబీరుల్లా, అమీన్‌ తదితరులు పాల్గొన్నారు.

బండారుపల్లెలో 'పశువుల పండుగ'


శిబిరంలో సేవలు అందిస్తున్న స్పెషలిస్ట్‌లు

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో మంగళవారం పండుగ వాతావరణంలో మెగా పశు వైద్య శిబిరం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తొలి దశలో పైలెట్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా బండారుపల్లెను ఎంపిక చేసింది. బండారుపల్లె పరిసర 13 గ్రామాల నుంచి సుమారు 1300 పశువులను రైతులు శిబిరానికి తీసుకొచ్చారు. వారం రోజులుగా పశు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశువులకు రక్తం, పేడ, చూలు, చర్మం, పాలు తదితర 7 రకాల పరీక్షలు చేసి శ్యాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపి రోగ నిర్ధారణ చేశారు. శిబిరానికి హాజరైన స్పెషలిస్ట్‌లతో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇలాంటి శిబిరాలతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు హర్షం చేశారు. ఈ శిబిరంలో 18 మంది స్పెషలిస్ట్‌ల ద్వారా వైద్య సేవలు అందించినట్లు మండల పశు వైద్యాధికారి శిల్పారెడ్డి తెలిపారు.

ఎంతో ఉపయోగకరం



గ్రామంలో మెగా పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. స్పెషలిస్ట్‌లు పశువుల ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. గర్భకోశ, చూలు, నట్టల నివారణ, చర్మ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

– నాదముని, పాడి రైతు, బండారుపల్లె

ఇళ్ల వద్దనే పరీక్షలు



వారం రోజుల నుంచి పశు వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి పశువులకు 7 రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో వాటికి సంబంధించి ఉచితంగా మందులు అందజేయడం సంతోషంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడూ జరగలేదు.

– లక్ష్మమ్మ, వెంకటాపురం

27న గుడిమల్లంలో నృత్యనీరాజనం


వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27 జరిగే నృత్యనీరాజనం కార్యక్రమం వాల్‌ పోస్టర్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో వే ఫౌండేషన్‌ సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిశారు. ఆయన చేతుల మీదుగా వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. వే ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27న ఆలయంలో 111 మంది కళాకారులతో నృత్యనీరాజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు చంద్రశేఖర్‌ అలియాస్‌ ఎస్‌ఎస్‌చంద్ర, దినేష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

నేడు కాళంగి గేట్లకు ఆయుధ పూజ

కేవీబీపురం: కాళంగి జలాశయం గేట్లకు బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా ఆయుధ పూజ నిర్వహించనున్నట్లు ఇరిగేషన్‌ ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. రైతులు, రైతు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

జై హనుమాన్‌...



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16కాళ్ల మండపంలో వెలసిన శ్రీఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి సింధూరంతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఓ వానరం చాలా సేపు ఆంజనేయస్వామి స్తంభం వద్ద కొద్ది సేపు వేచి ఉండడం భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఆంజనేయస్వామికి నైవేద్యంగా పెట్టిన అరటిపండ్లను ఒక్కొక్కటిగా లాక్కొని ఆ వానరం తినడాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

97 సచివాలయాలకు గడప గడపకు నిధులు

- ప్రతి మండలానికి రూ.60 లక్షల ఉపాధి నిధులు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గానికి మంజూరైన నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 97 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎంపిక చేసిన పనులకు ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర పనులను వెంటనే పూర్తి చేసి అధికారులు ప్రభుత్వానికి బిల్లులు సమర్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద ప్రతి మండలానికి రూ.60 లక్షలు చొప్పున గత నెల ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. ప్రజాప్రతినిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి అవసరమైన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. పనులు వేగవంతానికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

జగనన్న లేఅవుట్‌కు విద్యుత్‌ సౌకర్యం


సరఫరాను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు పంచాయతీ కోవూరుపాడు సమీపంలోని జగనన్న లేఅవుట్‌కు విద్యుత్‌ సౌకర్యాన్ని కల్పించారు. కాలనీకి మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌, కరెంటు స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేశారు. అధికారికంగా మంగళవారం స్థానిక సర్పంచ్‌ సామర్ల సుజాతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి సమక్షంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా కాలనీ వాసులకు విద్యుత్‌ సౌకర్యాన్ని కల్పించారు. త్వరలో వీధి లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.లైన్‌మెన్‌ ఏలుమలై, సోషల్‌ మీడియా నియోజకవర్గ కో–కన్వీనర్‌ శోభన్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ఆరోగ్యానికి భరోసా


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్‌ నాగరాజు

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 357 మంది రోగులను పరీక్షించి మందుల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ మండల ఇన్‌చార్జ్‌ గున్నేరి రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు. రూపాయి ఖర్చులేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి , మెరుగైన వైద్యం, అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ రెఫర్‌ చేస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీడీఓ గిడ్డయ్య, కో–ఆప్షన్‌ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య, యాదవ్‌, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నూతన కార్యవర్గం


వాణి


వల్లెమ్మ

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆశావర్కర్ల(ఏఐటీయూసీ) నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మంగళవారం పీహెచ్‌సీ ప్రాంగణంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌ రెడ్డి, యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు హేమావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా కె.వాణి, గౌరవ సలహాదారుగా పి.రేఖ, అధ్యక్షురాలిగా ఇ.వల్లెమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం.అంజలి, కోశాధికారిగా పుష్పలత, ఉపాధ్యక్షులుగా దేవకి, హిమావతి, వలర్మది, సహాయ కార్యదర్శులుగా వెంకటమ్మ, రెడ్డి లత, జ్యోతి, మరో 11 మంది కౌన్సిల్‌ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

సుదీర్ఘ సేవలకు గుర్తింపు


పురస్కారం అందుకుంటున్న రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ 74వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌ వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన రమేష్‌బాబు మంగళవారం పురస్కారం అందుకున్నారు. సుదీర్ఘ కాలం సేవలు అందించినందు స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ కార్యదర్శి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జ్ఞాపిక అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు పొంగళ్లు



విశేషాలంకరణలో ఎల్లమ్మ దేవి, పొంగళ్లు సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నివేదించారు.ఉదయం అమ్మవారి విగ్రహానికి పలు రకాల అభిషేకాలు చేసి, విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో ఎల్లమ్మ ముగ్గు వేశారు. గ్రామానికి చెందిన సుమారు 500 కుటుంబాలకు చెందిన మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌ సీపీ మండల ఇన్‌చార్జ్‌ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్‌ పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు ఏటా నవంబర్‌ మొదటివారంలో పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ.

ఎస్‌ఐ చొరవతో రోడ్డు మరమ్మతులు


యానాదివెట్టు వద్ద చదును చేయిస్తున్న ఎస్‌ఐ

వరదయ్యపాళెం: ఎస్‌ఐ నాగార్జునరెడ్డి చొరవకు.. మండల పరిషత్‌ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి సహకారం తోడవడంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలకు మరమ్మతులు జరిగాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కదూరు కూడలి నుంచి సత్యవేడుకు వెళ్లే ప్రధాన ఆర్‌ అండ్‌ బీ రోడ్డు మార్గంలో చిన్న పాండూరు వరకు పలుచోట్ల గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్పందించిన స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం మరమత్తులు చేపట్టాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, దామోదర్‌రెడ్డికి సూచించారు. వారు గుంతలను వెట్‌మిక్స్‌తో పూడ్చి, చదును చేయించడంతో రాకపోకలకు మార్గం సులభతరమైంది.

భూ రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్‌ చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇందుకోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని భవానీ శంకరాపురం గ్రామంలో భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో రీసర్వే రైతులకు ఓ వరమని తెలిపారు. అన్‌రిజిష్టర్‌, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని, పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సాగులో ఉన్నవారి పేరుపై భూమికి పాసుపుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. వీఆర్‌ఓ, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్‌ వ్యాధులపై ప్రజలకు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ వేంకటేష్‌ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సీజనల్‌ వ్యాధుల కట్టడికి గ్రామాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.